ప్రదక్షిణ

'ఏలేరామ్! నారేషనుకూడా తెచ్చేవా యేం? ఈరోజు నేను విడుదల కావాలి' అని వచ్చీరాని నేపాలీ భాషలో అడిగాను.

"ఉఁ! హవల్దారుయిస్తే తెచ్చేను. నాకా సంగతే జ్ఞాపకంలేదు" అన్నాడు దిలేరాం. దిలేరాం జైలులో వంటవాడు. సిక్కిం స్టేటు జైలులో నా విడుదలనాటికి మొత్తం పదిహేనుమంది ఖయిదీలం వున్నాం. నేను ఖయిదులో కాలు పెట్టింది లగాయితు యీనాటివరకు ఖయిదీల సంఖ్య యిరవైకి హెచ్చనూలేదు; పదమూడుకి తగ్గనూలేదు. అందుచేత రోజూ రేషనులెక్కలు మామూలుగా వుంటూవుండేవి. అనూ (ఆస్కాఖ్ లిప్పా) జైలులో 'ఓవర్‌సీర్'. పాపం అనూకి పథ్నాలుగుసంవత్సరాలు శిక్ష, దిలేరాంకి అయిదుసంవత్సరాలు. అబ్బ! ఎంత కష్టం. నాకుమాత్రం రెణ్నెల్ల పదిహేను రోజులూ రెండువందల సంవత్సరాలని పించింది.

దిలేరాం యిచ్చిన సమాధానంతో గుండెల్లో దడ బయలుదేరింది. జైలరుమీద కోపమూ వచ్చింది. వీడి దుంపతెగా, యింకా నన్ను నిర్బంధంలో వుంచుతాడా యేం. మళ్లీ రోజులు లెక్కపెట్టేను. పొరపాటేంలేదు. సరిగ్గా యీరోజే విడుదల దినం. మనసు ఒక్కసారిగా సత్యాగ్రహం వేపుకి మళ్లించేను. "నన్ను విడుదల చెయ్యకపోతే నువ్వేగతి సుమా!" అవును, మనస్సుని కూడా యిప్పుడే దిట్టపర్చుకోవాలి. జైలరు కాని విడుదల చెయ్యకపోయేడా, చచ్చేదాక సత్యాగ్రహం! ఢిల్లీదాక మనపేరు పరుగెత్తాలి; ఇలాంటి ఆలోచనలు రెణ్నెల్లో మనసులోంచి బుర్రలోకి, బుర్రలోంచి మనసులోకి పరుగెత్తడం మొదలెట్టేయి. ఇంతలో గేటుదగ్గర తలుపులు తెరిచిన శబ్దం వినిపించింది. హవల్దారు గేటుముందు నిల్చుని కోర్టుకు హాజరు పెట్టవలసిన ఖయిదీల పేర్లు గట్టిగా అరిచేడు. "యేయ్! హోసి; కుంజుటాసి - యిత్తా అయ్‌జా" (ఇలారండి)

మనసు తొందరపెట్టింది. నాపేరు పిలవలేదేం చెప్మా!...నాకాళ్లు నాకు తెలీకుండానే గేటు గుమ్మంవేపు నడిచేయి. "హవల్దార్ సాబ్, యీరోజు నేను విడుదలకావాలి" అన్నాను నేపాళంలో. హవల్దారు నోరు వెళ్లబెట్టేడు ఆశ్చర్యంగా. "ఆఁ! అప్పుడే అయిపోయిందీ! సరే, జైలరుతో చెప్పేస్తా" అని తలుపులు మూసీసేడు. మళ్లీ అయిదునిముషాల్లో తలుపులు తీసి "యేయ్! రబి, తయ్యార్ హోజావ్! ఘూటిమిలుచు" అన్నాడు.

వెనక్కి ఒక్క గంతువేసి వంటపంచ చేరుకున్నాను. వంటపంచలో దిలేరాం, అనూ కూర్చున్నారు. "అయితే తమ్ముడూ! వెళ్లిపోతానంటావా! దిలేరాం, గబగబా యిన్ని టీనీళ్లు మరిగించు! ఉఁ! గబగబా కానీ"అని దిలేరాంను అనూతొందర పెట్టేడు. నేను వంటపంచలోంచి నీళ్ళ పంపు వేపుదౌడు తీసేను. పంపుకింద బుర్ర పెట్టి జుత్తు కొంచెంగా తడిపి, ముఖంకడిగేను. అక్కడనుంచి నాగది (సెల్)లోకి పరుగెత్తేను. ఇంక సర్కారుబట్టలు విడిచి

రవికిరణ్ (సిక్కింస్టేట్)

నాబట్టలు కట్టుకోవాలి. ముందు రోజే నాబట్టలు వుతుక్కున్నాను. అంటే ఒక నిక్కరు, ఒక బనియను, సగం అల్లిక విడిపోయిన ఒకవూలు బనియను—నావిడుదల నాటికి నాకు మిగిలిన బట్టలు. యింతే. ఈ మూడింటిని వుతకటానికి—మాటవరసకి—సర్కారు సప్లయి నావరీతు, అనూవంతు, దిలేరాంవంతు వచ్చిన సబ్బుముక్కలు చాలలేదంటే నమ్మండి. అంచేత ముఖం రుద్దుకోడానికి సబ్బుముక్క లేకపోయింది. సబ్బుముక్క లేకపోతే పోయింది; ఈ నాటితో శని విరగడైంది. ఈ రోజు నుంచి బయట బాహాటంగా తిరుగుతాను. స్వేచ్ఛగా స్వచ్ఛమయిన గాలి పీల్చుకుంటాను. నాల్గుగోడలమధ్య యీబ్రతుక్కి యీ నాటితో స్వస్తి. సరిగ్గా జ్ఞాపకం లేకపోయినా "యీనాడు తీరునే - యీ పంజర పుబ్రతుకు" అని చిన్నచిన్నగా పాడుకున్నాను. మళ్లీ ఆలోచనలో పడ్డాను. ఇంక ఒకటిరెండు గంటల్లో పచ్చికబీడులు చూడలేకపోయినా పచ్చని వృక్షాలు చూస్తాను. వెండికి మల్లే ప్రవహిస్తూ, మీదపడే ప్రతి సూర్యకిరణాన్ని కళ్లల్లోకిచిమ్మే సెలయేళ్లను చూస్తాను. ఎంతసరదాగా వుంటుంది! హిమాలయాల దృశ్యాలు అతి మనోహరములు.

అబ్బ! యీ రెణ్నెల్ల పదిహేనురోజులు యెంతగడ్డుగా గడిచేయి! ఉదయం కాగానే రాత్రికోసం, రాత్రికాగానే వుదయంకోసం ఎదురుచూడవలసి వచ్చేది. గట్టిగా పచారుచేద్దామన్నా పదిగజాల పొడుగూ, పదిగజాల వెడల్పుకన్నా హెచ్చులేదు, జైలులోపలి విస్తీర్ణం. ఇందులోనే తూర్పు వేపుమూల మరుగుదొడ్డి. కంపుకంపు. గోడాగొందీ లేదాయె. గజం వెడల్పుటిన్నురేకేగోడాయె. పగవాడికికూడా వద్దుయిటువంటి జైలుజీవితం! నా జీవితానికి సిక్కింసేటుజైలు చేసికు ట్రయినింగు స్కూలు. పాపం నా ఆంధ్ర సహోదరులు యీమాత్రం దానికోసం, సంవత్సరమో రెండు సంవత్సరాలో వృథా ప్రయాసపడి పైసా ఖర్చుచేసుకుంటూవుంటే, కానీ కర్చులేకుండా నేను ట్రయినింగు పూర్తి చేసేను!

"ఛ, ఛ, యిప్పుడు యిటువంటి ఆలోచనలన్నీ యేమిటి. సంతోషంగా బయటకు వెళ్ళాలి - విజయం పొందాలి." సర్కారు బట్టలు నీలిరంగు లాగు, మొండిచేతుల చొక్కా యిప్పేసి నా నిక్కరు బనియను తొడుక్కున్నాను. స్వెట్టరు మాత్రం ఎండలో వేసేను. మళ్లీ వంటపంచలోకి పరుగెత్తేను. "తయ్యారయ్యే నోహో!" అని గట్టిగా కేకపెట్టేను. దిలేరామ్ నాకిచ్చిన సిలవరుచిప్పలో టీ నీళ్లు - డికాషను పోసేడు. దీన్నే నేపాలీలో 'రంగ్' అంటారు. నేను జైలులో కాలుపెట్టింది మొదలు యీ 'రంగ్' త్రాగటానికి అలవాటుపడ్డాను. ఇందులో యిష్టంవుంటే వుప్పుతో, లేకపోతే అలాగే గుటకరించటం అందరికీ (ఖయిదీలందరికి) పరిపాటి. ఇంటిదగ్గర అమ్మ ఎప్పుడన్నా టీ పెట్టిందంటే, సమయాసమయాల్లో కాఫీగుండ లేనప్పుడు, గ్లాసు విసిరికొట్టేవాడిని. ఏమయినా సరే నాకు కాఫీగాని గిట్టదనేవాడిని. 'సమయం వస్తే వసుదేవుడు గాడిదకాళ్లు పట్టేట్ట' అదంతా యెందుకు? మొదటిరోజున నేను జైల్లో కాలుపెట్టగానే నాల్గోగంటయేటప్పటికి ఒకటోకు జొన్నలు వేయించి యిచ్చేరు. చిప్పలో రంగ్ కూడా యింత పోసేరు. అది ఆ రాత్రికి నా భోజనమన్నమాట. ఆనాడు నాకు అరికాలిమంట నెత్తికెక్కింది. తొలిరోజు అందరికీ ఇదేవిధంగా

యిస్తారు. ఇదేం ఖర్మ సుర్రాల దాణా యిస్తారేం చెప్మా? ఈ టీ డికాషనేమిటి, వీళ్లంతా అన్నంతింటూ నాకు జొన్నలు యియ్యటమేమిటి, అంతా కలగా వుంటే! వెంటనే మహాకవి శ్రీనాథుడు జ్ఞాపకం వచ్చేడు. ఈ జొన్నకూడు, జొన్నంబలి తినలేక రాయలసీమని తిట్టిపోసేడు. గరళ కంఠునికూడా పందెంలోకి దింపేడు. గరళాన్ని మింగలేక ఈశ్వరుడు గొంతులోనే వుంచీసేడుట. ఈ యిద్దరిలో యే వొక్కరూ కూడా 'రంగ్' ప్రభావం యెరుగరు నేనుమాత్రం యీ రెంటి రుచికి గురికావలసి వచ్చింది. పద్యాలు చెప్పటం రాదుగాని లేకుంటే శ్రీనాథుడేమూల? మొత్తానికి యీ రంగ్ తెలుగు కవుల అనుభవంలోకి తేబడలేదనుకుంటాను.

"ఇంకెంతోసేపు లేదు. ఒకటి రెండు గంటల్లో యీ యెత్తుగోడలు దాటి జెల్లిపోతావులే; నువ్వు రోజులు లెక్కవేసేవు, మేం సంవత్సరాలు లెక్కవేస్తున్నాం." అని మెల్లిగా నిస్సారంగా గొణిగేడు అనూ. అవును, అనూ కష్టం నాకిప్పుడు గుర్తుకు వచ్చింది. నేను రెణ్నెల్లకే విసుగెత్తిపోయేను. రోజూ బంగాళాదుంపల కూర; ఉప్పుడు బియ్యం అన్నం. చప్పగా యెంతకని తిని యేవటం? వీళ్ళ రేషను తగుల్డేటేవుంది. మెల్లిగా ఒక పిటిషను రాసి పారేసేనేగాని...పాపం ఖయిదీలకి యెంత కష్టం! నాకేగాని నేపాళ మాంత్రికుని మంత్రం వస్తేనా! జైలునే అమాంతంగా మాయం చేసేవాడిని! అబ్బబ్బ! నన్ను యెంత కష్టపెట్టేరు. కప్పుకుందికి యిచ్చేరా? పరుచుకుందుకు ఇచ్చేరా? జైల్లో ప్రతి ఖయిదీకి రెండేసి కంబళ్లు యిచ్చేయాలన్న నియమం వుంటే, వీళ్ళ ముల్లెం పోయింది? అధమం ఒక్క కంబళీ కూడా యిచ్చేరు కాదు. సర్కారు సప్లయి చేసింది గూడా యివ్వటానికి వీళ్ళ మనసొప్పదు. 'దేముడు వరమిచ్చినా పూజారి యివ్వడుట' అందులోనూ ఖయిదీల కియ్యటానికి. ఖయిదులో - నాల్గుగోడల మధ్యా ప్రపంచానికి కనుపించకుండా యిరుకు గదుల్లో పెట్టి తాళాలు బిగిస్తారు. కడుపు నిండా తిండి పెట్టరు. రుచికరమైన పదార్థాలు తినటానికి నోరూరితేమాత్రం ఎలా వస్తాయి? చప్పగా యీ బంగాళాదుంపలు! యేమిటో ఖర్మం. నేను ఆంధ్రుణ్ణికదా. మిరపకాయ కారం తెగతినవలసినవాడిని! దేశంవెళ్లి చింతకాయ పులుసు, గోంగూర పచ్చడి తెగతినాలి! అధమం తలకి నూనె గూడా యియ్యరు. బ్రహ్మ రెండే రెండు చేతులు యిస్తే తుప్పబుర్ర గోళ్లు నేదెట్లా? ప్రపంచంలో పేలన్నీ సిక్కింజైలులో ప్రవాసం చేస్తున్నాయేమో! నా ఒక్కడి పాపం గాదు. అందరికీ అంతే. జైలులో కాలు పెట్టేడా అంటే—ఊకారాంతః స్త్రీ లింగో (స్త్రీ లింగంలోకి చేరుస్తున్నాను) పేను శబ్దః-పేను, పేనుః-పేనూ పేన్వః అని శబ్దాలు నేర్చుకోవాలి తన

అసలైన
గొల్లభామ మార్కు
పాలగుర్తు



ఉత్తమమైన వాటిని కొనటం ప్రయోజనకరమని జీవితంలో మనకు త్వరలోనే తెలిసివస్తుంది. శ్రేష్ఠమైన సరుకు కోసం కొంచం అదనంగా అయ్యేడబ్బు సద్వినియోగమే అవుతుందని మన తలిదండ్రులు యెరిగియుండిరి, మనకూ తెలుసు. కాబట్టి గొల్లభామ మార్కు పాలు అనేక దశాబ్దాలుగ భారత దేశంలో ఎరి, కోరి వాడబడుతున్నది. ప్రజాభిమానం చూరగొన్న ఈ పాలు అట్టి అభిమానానికి పాత్రమయేట్లు తయారు చేయబడ్డవి.

ఆ అగనపు దమ్మిడీల విలువ గ్రహించండి.

ఉత్తమమైన వాటినే కొని వాటిని సద్వినియోగం చెయ్యండి

★

వివరములు తెల్పు కరపత్రం కోసం మాకు వ్రాయండి:

నెసిల్స్ ప్రాడక్ట్స్
(ఇండియా) లిమిటెడ్,
పో. బా. నం. 180, మద్రాసు-1.

శరీరం అంతా ప్రేమమయం కావాలి. పగలల్లా యెక్కడ దాక్కుంటాయో కాని రాత్రి 'సెల్'లోకి పడుక్కుందికి వెళ్లేమా, వచ్చేమన్నట్టూ లేదు. ఇంతమంది కాంగ్రెసు సత్యాగ్రహులు జైళ్లలో వున్నారు కాని— సిక్కింజైలులో వుంటే సత్తా తెలిసేది!— యీఅనుభవం వాళ్ళకి లేదనుకుంటాను. ఒక వేళ అటువంటిదే తటస్థిస్తే "జన్మలో మరి జైల్లోకి వెళ్లం" అని ఒట్టు పెట్టుకు నేవారేమో?

పైసాపరక జీవితంలో ధర్మం చెయ్యక పోయినా శిబిచక్రవర్తికి మళ్లే ఖైదీ రుధిర ధర్మం చేస్తాడు. శిబిని మమ్మల్ని సరిపోల్చి చూస్తే— శిబిజీవితంలో ఒకేమారు కండల్ని కోసియిచ్చేడు; మేము అనునిత్యం మా రక్తాన్ని యిస్తున్నాం. శిబి కత్తికొటుకు ఒకేసారి నొప్పుకున్నాడు, మేము ప్రతి రాత్రి పేనుకొట్లకు...శిబి ఒక్క పక్షికి మాత్రం తన మాంసాన్ని యిచ్చేడు. మేమో వందలాది పేలకు మా రుధిరాన్ని యిస్తున్నాం. శిబిఒక్కడే ధర్మాత్ముడు కాదు. సిక్కింజైలు రిజిష్టర్ ప్రకారం మేమందరం శిబిచక్రవర్తి కన్నా మిన్నలమని పించుకున్నాం. సిక్కింజైలు యీనాటివరకూ ఎంతమందిని నిర్బంధించిందో అంతమందినీ 'అపరశిబులు' అని పిలవ్వలసివస్తుంది.

యిదెక్కడి పేల సంసారం! భగవంతుడా! 'పైడ్ పైపర్ ఆఫ్ హేమిలన్' యీనాడు బ్రతికివుంటే అమాంతంగా కాళ్ళమీదపడి "పైడ్ పైపర్! నీబాకా వూది యీ పేలను యెక్కడికన్నా తీసుకుపో బ్రదర్" అని మొర పెట్టుకు నేవాడిని.

సరిగ్గా జ్ఞాపకం లేకపోయినా ఒకమహానుభావుడు రచించిన వ్యాసం—ఒక మధ్యవర్తి పెళ్లివార్ని గురించి వర్ణించటం—అది నిజమే కావచ్చు, కాకపోనూవచ్చు. ఇది మాత్రం నాజీవితంలో అక్షరాలా అనుభవించిన యితివృత్తం. పడుక్కోవటానికి భూతలశయనం, కప్పుకుందికి జైలుపైకప్పే, చింపిరితల, పేలసంసారం. ఆంధ్రుల ఫిద్దలు అనుభవజ్ఞులు.

దీనితో సరిపోయిందీ! ఈ పేలబాధ భరించలేక—భరించక తప్పదనుకోండి— జుట్టు మొదలంటా గొరిగించేసేను. జుట్టంటే కత్తిరింపించేనుగాని గడ్డమో? దీనికి రెండో సాధనం లేదు. మళ్లీ జైలరుతో మొర పెట్టుకోవాలి, బేరుకోవాలి. "నీ వేతస్వ నితకపరం లెకుగ...సంరక్షించు భద్రాత్మకా" అని పొంగ వేస్తే వారంపదిరోజులతర్వాత ఒక బ్లేడు విసిరికొడ్తాడు. ఆత్మకు యింతకష్టం ఎందుకు కల్గజెయ్యాలి! అంచేత గడ్డం అలా వుంచెయ్యటమే. నేను ఒక వేదాంతిగా తయారవుతానేమో? గెడ్డాం పెంచటంకూడా సరదా అనిపించింది. చాలామంది నవీన బెంగాలీ యువకులు జ్ఞాపకం వచ్చేరు. అటుతరవాత రవీంద్రుడు, బెర్నార్డ్‌షా, టాల్‌స్టాయి, మార్క్స్, లెనిన్ మున్నగు మహానుభావుల గెడ్డాలను స్ఫురణకి తెచ్చుకున్నాను. అంతటి మహానుభావులకు గెడ్డం ఒక అలంకరణ అయినప్పుడు, మనకిమాత్రం యెందుకు కాకూడదు? ఈవిధంగా మనసుని సముదాయించుకుని తృప్తిపడ్డాను.

గత్యంతరం లేదు. సమయానుకూలంగా కాలం గడపాలి. 'నొప్పించక...తానొవ్వక' అన్నాడొకకవి. నిజానికి కవిత్వం నాకబ్బలేదుగాని లేకుంటే శ్రీనాథుడు, తెనాలి రామకృష్ణుడు యేమూలకి? శతసహస్రాలుగా సిక్కింజైలుమీద పద్యాలురాసి వుండేవాడిని. పూజ్యులు కీర్తిశేషులు శ్రీ పానుగంటి లక్ష్మీనృసింహారావుగారు యిటువంటి జైళ్ళమీద తమ విసురు దూపలేదందు చేతో! (నేను సాక్షి అన్ని భాగాలు పూర్తిగా చదవలేదు.) అలా ఒక వేళ ఆయన కలం జైళ్లమీదకూడా చింగులు ద్రొక్కివుంటే, ఆయనకు రెండు చేతులు ఎత్తి నమస్కరిస్తాను.

పురాణేతిహాసాలు జ్ఞాపకానికి వచ్చేయి. చచ్చిన తర్వాత జీవుడిని యమదూతలు యమపట్నం చేరుస్తారట. అక్కడ న్యాయమూర్తి పాపులకు దండన విధిస్తాడు. ఇది నిజమో కాదో తెలియదు. నేనుమాత్రం అటువంటి దండనల్ని సిక్కిం జైలులో అనుభవించాను. ఒక వేళ నేను చచ్చిన తర్వాత యమలోకం వెళ్లనక్కర్లేదేమో?

ఈరోజు నాకు పర్వదినం. నన్ను విడుదలచేస్తారు, మహా నరకకూపంలోంచి ఇంకొన్ని నిముషాల్లో బయటపడతాను. ఈ యెత్తుగోడల బయట నిలుచుంటాను. ఈ జైలుకి గుడ్ బై కొట్టేస్తా. మరెప్పుడూ వద్దు యీ జైలు నివాసం.

ఇంతలో గేటుతలుపు తీసి హవల్దారు "రబి యిత్తా ఆయ్‌జా"! అని కేక పెట్టేడు. అనూ దిలేరాంలు గేటుదాకా సాగనంపేరు. గేటులోంచి ఆఫీసులోకి గంతు వేసేను. దిలేరాం నా స్వెటరు తీసుకు వచ్చి యిచ్చేడు. జైలరు కాగితాలమీద యేదో గోలికి సెంట్రీకి యిస్తూ; "ఇతనితో కోర్టుకు వెళ్లు, అక్కడనుంచి నీకు విడుదల- ఇది దస్తూరు" అన్నాడు. 'సెంట్రీ వీధి గేటు తలుపులు తీసేడు. బయటకి నడిచి నాల్గు వేపులా కలయచూసేను. గట్టిగా గాలి పీలుస్తూ 'ఇక్కడే వుండు, జైలుగోడ చుట్టి వస్తా' అని సెంట్రీతో చెప్పి జైలుగోడల చుట్టూ పరుగెత్తేను. మళ్లీ అయిదునిముషాల్లో సెంట్రీ నిలబడ్డచోటుకి వచ్చేను. జైలరు హవల్దారు ఖంగారుగా బయటకు వచ్చేరు. 'ఇవంతా యేమిటి రబి?' అని జైలరు అడిగేడు. 'ఏ మీ లేదు సార్' అంటూ "ప్రదక్షిణ నమస్కారా న్సమర్పయామి" అని జైలుగోడలకి నమస్కరించేను. "మరేం లేదుసార్ మరెప్పుడు యిలువంటి జైలు జీవితం వద్దని, మళ్ళీ నన్ను ఇక్కడకు పిలవవద్దని యీ జైలు గోడలకు నమస్కారాలు సార్."

జైలరు, హవల్దారు బిరగబడి నవ్వేరు. నేనుమాత్రం చలించకుండా యీ అనుకున్నాను. జాంబవంతుడు రోజూ భూమిని చుట్టి వచ్చేవాడట. కాని భూప్రదక్షిణ చేయలేని మన పూర్వులు (మన కాలంలో కూడ) గోప్రదక్షిణలు చేసేరు, చేస్తున్నారు. అందరూ పుణ్యార్జనకోసం ప్రదక్షిణాలు చేస్తే నేను విముక్తికే చేసేను!! "ఆహా సిక్కిం జైలా! భక్తి శ్రద్ధలతో, నీ మహిమకు దాసుడనై, అంజలి ఘటించి ప్రదక్షిణ సల్పితిని. ఇక సెలవు." అంటూ సెంట్రీ వద్ద కాలే కోర్టువేపు నడిచేను. ★

"మీ అబ్బాయిని అంత ఎత్తు మంచంమీద పడుకోపెట్టా రేమిటండీ?"

"ఆ, ఏంలేదు, కిందపడితే వెంటనే తెలుస్తుందిగదూ, అందుకని."

కాంచన ద్వీపం

వెల 1-8-0

పోస్టుఖర్చులు ప్రత్యేకం.

శ్రీమదాంధ్ర

మహాభారతము

ఉద్యోగపర్వము

వెల రూ 1-0-0

ఆంధ్రగ్రంథమాల,

మద్రాసు 1.